సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పక్కన పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయ గోపురానికి బంగారు తాపడం

- కార్తీక మాసంలో ఘనంగా దీపార్చన చేయాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- హైదరాబాద్‌లో ఆలయాల అభివృద్ధిపై సమావేశం

వేములవాడ, సెప్టెంబర్ 19: వేములవాడ రాజన్న ఆలయ ప్రధాన గోపురానికి బంగారు తాపడం చేయించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వేములవాడ, భద్రాచలం, బాసర ఆలయాల అభివృద్ధిపై మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి సమీక్షించారు. రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ఆర్కిటెక్‌ను నియమించుకొని పక్కా ప్రణాళికతో ముందుకుసాగాలని సూచించారు. వారం, పది రోజుల్లో తాను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. భక్తుల ఇచ్చిన బంగారు, వెండి కానుకలు బ్యాంక్‌లో నిల్వ ఉన్నందున వాటిని సద్వినియోగం చేయాలని, మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయం పునర్నిర్మాణం పూర్తయిన వెంటనే స్వామివారి గోపురానికి బంగారు తాపడం చేయించాలని ఆదేశించారు. ప్రధాన అంతర్ ఆలయం కూడా వెండితో తీర్చిదిద్దాలని కూడా చెప్పారు. వచ్చే కార్తీక మాసంలో ప్రతి సోమవారం దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, వేములవాడ ఆలయ ఈవో వినోద్ రెడ్డి, స్థపతి ఎన్. వల్లి నాయగన్, ఎస్ఈ దుర్గా ప్రసాద్, సహాయ స్థపతి పి. గణేశన్, ఆలయ ఇన్‌చార్జి స్థానాచార్యులు నమిలి గొండ ఉమేశ్, ప్రధాన అర్చకులు శరత్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ ఉన్నారు.

అన్నపూర్ణకు కొనసాగుతున్న కాళేశ్వరం జలాలు

అన్నపూర్ణ ప్రాజెక్టులోకి కాళేశ్వరం నీటిని ఎత్తిపోస్తున్న బాహుబలి మోటర్లు

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 19 : మండలంలోని అనంతగిరి గ్రామ శివారులోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు కాళేశ్వరం జలాలు గురువారం బాహుబలి మోటర్ల ద్వారా రోజుకు 3220 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయడం కొనసాగుతోందని ఏఈ సమరసేన తెలిపారు. రాజరాజేశ్వర (మధ్య మానేరు) ప్రాజెక్టు నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా తిప్పాపూర్ పంప్‌హౌస్‌లోకి గోదావరి జలాలు రాగా, బహుబలి మోటర్ల ద్వారా అన్నపూర్ణలోకి ఎత్తిపోస్తున్నారు. ఈ ప్రాజెక్టులో 3.02 టీఎంసీ నీరు నిల్వ ఉండగా సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

అటకెక్కుతున్న ఈ-టికెట్!

- నాలుగు రోజులుగా రాజన్న ఆలయంలో నిలిచిన విధానం
- ఆ ఉద్యోగి లేకపోతే అంతే..
- పారదర్శకతలో కానరాని శ్రద్ధ

ఆలయంలో ముఖ్యబుకింగ్ కౌంటర్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ అక్కడే ఉన్న మ్యానువల్ టికెట్లు

ప్రసాదం టికెట్లను కూడా మాన్యువల్‌గా ఇచ్చారని చూపుతున్న భక్తుడు

వేములవాడ, సెప్టెంబర్ 19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయంలో పారదర్శకంగా ఉండి మరింత పకడ్బందీగా పర్యవేక్షించేందుకు ప్రవేశపెట్టిన ఈ-టికెట్ విధానం అప్పుడప్పుడు అటకెక్కుతోంది. అయితే, పర్యవేక్షణ చూసే రికార్డు అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి అత్యవసర పరిస్థితిలో సెలవుపై వెళ్తే ఇక దాని సంగతి అధోగతే..! అన్నట్లుగా ఉన్నది ఆలయ అధికారులు తీరు. ముఖ్యంగా రాజన్న ఆలయంలోని లడ్డూ ప్రసాద విక్రయం, స్వామివారి నిత్య అర్జిత సేవలైన ముఖ్య బుకింగ్ కౌంటర్లలో ఈ-టికెట్ విధానాన్ని అమలు చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకొని పారదర్శకంగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఈ విధానం ప్రస్తుతం రాజన్న ఆలయంలో నాలుగు రోజులుగా నిలిచిపోయింది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఈ విధానాన్ని నిలిపేశారు. పాత పద్ధతిన మాన్యువల్‌లో రిసీట్ బుక్ ద్వారా టికెట్లను భక్తులకు కేటాయిస్తున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కరించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

ఆ ఉద్యోగికే ఈ-టికెట్ విధానం తెలుసు..!

రాజన్న ఆలయంలో 60 మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తుంటారు. ఏఈవో నుంచి మొదలుకొని రికార్డ్ అసిస్టెంట్ వరకు ఉద్యోగులు ఉన్నా ఆధునిక సాంకేతికతను మాత్రం అందిపుచ్చుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగికి ముఖ్యబుకింగ్ కౌంటర్ బాధ్యతలు అప్పగిస్తే సదరు ఉద్యోగి తనకు కంప్యూటర్ తెలవదని, తాను విధులు నిర్వహించడం ద్వారా నగదు నష్టం వచ్చిందని అధికారులను వేడుకోవడం ఇందుకు నిదర్శనం. దీంతో సదరు ఉద్యోగికి వేరేచోట విధులు అప్పగించి, దినసరి ఒప్పంద ఉద్యోగి సేవాదార్‌తో సేవలు నడిపించారు. ప్రస్తుతం నాలుగు రోజులుగా కంప్యూటర్ ఈ-టికెట్ విధానం రెండు కౌంటర్లలో నిలిచిపోయింది. అయితే, కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగికి మాత్రమే ఈ సాంకేతికతపై అవగాహన ఉండడం విశేషం. సదరు ఉద్యోగి అత్యవసర పరిస్థితుల్లో సెలవులో వెళ్లగా ఈ-టికెట్ కేటాయింపులో సాంకేతిక సమస్య రావడంతో ప్రస్తుతానికి ఈ విధానం నిలిపివేసి మాన్యువల్ పద్ధతి రిసీట్ బుక్ ద్వారా భక్తులకు టికెట్ కేటాయిస్తున్నారు. సాంకేతికత నిలిచిపోవడంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం లేకపోగా ఇక పాత పద్ధతే అవలంబిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది.

సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చాం

ఈ టికెట్ విధానంలో కొంత సాంకేతిక సమస్యలు వచ్చాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా మ్యాన్యువల్ పద్ధతిలో టికెట్లు కేటాయిస్తున్నాం. అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు వస్తున్నందున తాత్కాలికంగా చూసే ఉద్యోగి సెలవులో ఉండడంతో ప్రస్తుతం పాత పద్ధతిని కొనసాగిస్తున్నాం.

- బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఏఈవో రాజన్న ఆలయం వేములవాడ

ఎన్ఏఎస్ ఉత్తీర్ణతలో జిల్లాను మొదటి వరుసలో ఉంచాలి

డీఎస్‌వో పాముల దేవయ్య



మాట్లాడుతున్న డీఎస్‌వో దేవయ్య

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 19 : ఎన్ఏఎస్ పరీక్షలో ఉత్తీర్ణతలో జిల్లాను మొదటి వరుసలో నిలపాలని డీఎస్‌వో పాముల దేవయ్య సూచించారు. గురువారం మండలంలోని గాలిపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మేకల పావని ఆధ్వర్యంలో ఇల్లంతకుంట, బోయినిపల్లి, తంగళ్లపల్లి మండలాలకు చెందిన బయోసైన్స్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి పాఠశాల నుంచి ఎన్ఏఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా చూడాలన్నారు. అనంతరం ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. టీబీఎస్ఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కే మల్లారెడ్డి జడ్పీ హెచ్ఎస్ కందికట్కూర్, ప్రధానకార్యదర్శిగా ఎం రాజు టీజీఎంఎస్ రహీంఖాన్‌పేటను ఎన్నుకున్నామన్నారు. మండల విద్యా వనరుల కేంద్రం రిసోర్స్ పర్సన్ మల్లేశం, మహేశ్ చంద్ర, యాద రవి ఉన్నారు.

కోట సచ్చిదానంద శాస్త్రి మృతిపై కళాకారుల సంతాపం

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 19: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ హరికథా పితామహుడు కోట సచ్చిదానందశాస్త్రి మృతిపై వేములవాడ నృత్యకళానికేతన్ సంస్థ కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నృత్యకళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోశెట్టి మాట్లాడుతూ రాజన్న ఆలయంలో 70 ఏళ్లుగా జరుగుతున్న ప్రతి ఉత్సవాలకు వారు హాజరై వారి హరికథాగానంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేసేవారని కొనియాడారు. కళాకారులు బొడ్డు రాములు, సత్తయ్య, రవిగౌడ్, మారుపాక శంకర్ పాల్గొన్నారు.

కోట సచ్చిదానందశాస్త్రి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బోయినపల్లి, సెప్టెంబర్ 19 : బోయినపల్లిలో బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు తల్లి రాజవ్వ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరుల ఉన్నారు.

రైస్ మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

సీఎంఆర్ గడువులోగా ఇవ్వాలి

అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

వేములవాడ, సెప్టెంబర్ 19 : సీఎంఆర్ గడువులోగా ఇవ్వాలని రైస్ మిల్లుల యజమానులను జిల్లా అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ ఆదేశించారు. వేములవాడలోని పలు రైస్ మిల్లులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లులో బియ్యం నాణ్యతను పరిశీలించారు. రైస్ మిల్లులకు ధాన్యం ఎంత కేటాయించారు. ఇప్పటి వరకు సీఎంఆర్ ఎంత ఇచ్చారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు తమకు ఇచ్చిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి ఉన్నారు.

పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 19 : వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో రాజేశ్వర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాపై బూత్ స్థాయి అధికారులచే ఇంటింటా సర్వే ప్రారంభమైందన్నారు. 98.3 సర్వే పూర్తయ్యిందన్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల లోకేషన్ల మార్చిడి, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై పార్టీల ప్రతినిధులతో చర్చించారు. మున్సిపల్ కమిషనర్ సంపత్, పార్టీ ప్రతినిధులు నిత్యానందరావు, రాము, హన్మాండ్లు, రామస్వామి, తదితరులున్నారు.

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుట్‌లెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్లా బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య



టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు

తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంక్‌రప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండికొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్
- దసరా తర్వాత కోర్సులు ప్రారంభం

స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు కో చైర్మన్ శ్రీని రాజు, సభ్యులు దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్పెయిన్ రాయబారి జువాన్ ఆంటోనియో మార్చ్ పుజోల్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై సీఎంను అభినందించారు. స్పెయిన్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.

భారత్‌పై ఫెడ్ ప్రభావమెంత!

అర శాతం వడ్డీరేట్ల కోతపై భిన్నాభిప్రాయాలు

ముంబై, సెప్టెంబర్ 19: వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల మీద ఆ ప్రభావం ఎంతన్నదానిపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దేశీయ ఎక్స్‌పర్ట్స్ పెట్టుబడులు పెరుగుతాయంటుంటే.. మరికొందరు ఈక్విటీలపై రాబడులు తగ్గుతాయని, బంగారం ధరలు పెరుగవచ్చని అభిప్రాయపడుతున్నారు. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ.. బెంచ్‌మార్క్ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 4.75-5 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. మునుపు ఇది 5.25-5.50 శాతంగా ఉండేది. గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించేందుకు వరుసగా 14 నెలలపాటు 20 ఏండ్ల గరిష్ఠ స్థాయిలోనే కీలక వడ్డీరేటును అగ్రరాజ్య సెంట్రల్ బ్యాంక్ ఉంచింది. 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఊహించిందే. బంగారం ధరల్లో పెరుగుదలకు, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులపై లాభాల తరుగుదలకు